క్లుప్తంగా

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు



పొన్నూరు: పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ కవర్ల విక్రయం, వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. సోమవారం ప్రధాన సెంటర్లలో ఆయన పర్యటించి ప్లాస్టిక్ వినియోగాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రోత్సహించవద్దని, ఇకపై వినియోగిస్తే తగిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. ప్లాస్టిక్ వినియోగంతో జరిగే అనర్థాలను పట్టణ వాసులకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు పంచాయతీలో అధికారులు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయిస్తున్నారు. మేజర్ పంచాయతీ ప్రత్తిపాడులో గత కొద్ది రోజులుగా విద్యుత్ దీపాలు వెలగడం లేదని అనేక వీధుల్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న లైట్లు మరమ్మతులకు గురయ్యాయని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ గత నెల 28న 'ప్రత్తిపాడులో అలముకున్న చీకట్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ప్రత్తిపాడు పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా సిబ్బందితో దగ్గరుండి వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 150 విద్యుత్ లైట్లను కొనుగోలు చేసి వీధుల్లో అమర్చుతున్నారు.

క్లోరినేషన్ నీటిని సరఫరా చేయాలి



ప్రత్తిపాడు: గ్రామ ప్రజలకు క్లోరినేషన్ చేసిన తాగునీటిని సరఫరా చేయాలని ఎంపీడీవో కె.శివపార్వతి అన్నారు. మండల పరిధిలోని పాతమల్లాయపాలెంలో సోమవారం ఆమె పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటికీ చెత్త సేకరణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని అంతర్గత వీధుల్లో పర్యటించారు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వస్తున్నారా.. చెత్త సేకరిస్తున్నారా.. వంటి వివరాలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్, రక్షిత మంచినీటి పథకం, పారిశుద్ధ్య నిర్వహణ వంటి విషయాలను పరిశీలించారు. తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి కంపోస్టు ఎరువును తయారు చేయాలని కార్యదర్శి వీఎస్ రెడ్డిని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఉపసర్పంచ్ తదితరులున్నారు.

వీవీఐటీ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర నేడు

పెదకాకాని: నంబూరులోని వీవీఐటీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మంగళవారం జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్ర పెదకాకాని ఇస్కాన్ మందిరం నుంచి గోళ్లమూడి గ్రామం మీదుగా యూనివర్సిటీకి చేరుకుంటుందన్నారు. ఉదయం 8 గంటలకు వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది, భక్తులతో యాత్ర ప్రారంభమవుతుందని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలియజేశారు.

భూమి అమ్మకం పేరుతో మోసం!

పెదకాకాని: భూమి అమ్మకం పేరుతో మోసం చేయడంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. పెదకాకాని మండల పరిధిలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మహిళ(గతంలో వలంటీరు) రియల్ ఎస్టేట్ పేరుతో మరొక మహిళకు లలిత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో సెంటు రూ.2 లక్షలకే వస్తుందని నమ్మబలికింది. భూమి ఇస్తారని ఆశ చూపించి దశలవారీగా రూ.15 లక్షలు వసూలు చేసింది. వాటిలో రూ.7 లక్షలు ఆన్‌లైన్ బ్యాంక్ ఖాతాల ద్వారా చెల్లింపులు జరిగాయి. బాధిరాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టీపీ నారాయణస్వామి సోమవారం తెలిపారు.

ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు

- కూటమి ప్రభుత్వంలో వైద్య శిబిరాలకు మంగళం
- వైఎస్సార్ సీపీ హయాంలో ప్రజారోగ్యానికి పెద్దపీట

పొన్నూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరుతో ఇంటింటికీ వెళ్లి ప్రజల వ్యాధులను గుర్తించేది. ఆ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పేదలకు మందులు పంపిణీ చేసింది. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న రోగులను గుర్తించి కార్పొరేట్ వైద్యశాలల్లో మెరుగైన చికిత్స అందించి ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది. కానీ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యశిబిరాలకు మంగళం పాడింది. ఏడాది పూర్తయినా గ్రామాల్లో ఆరోగ్య శిబిరాల ఊసేలేదు. ప్రస్తుతం వర్షాకాలం రాకతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

వైద్య శిబిరాల ఊసేలేదు..



కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో వైద్య శిబిరాల ఊసేలేదు. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు వైద్యానికి పెద్దపీట వేసింది.

– డాక్టర్ నల్లమోతు రూత్ రాణి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు



జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది(ఫైల్)

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

ప్రత్తిపాడు: విద్యార్థుల ఉజ్వల భవితే లక్ష్యంగా కళాశాల యాజమాన్యం అడుగులు వేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్ అన్నారు. గుంటూరు రూరల్ మండలం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో సోమవారం ప్రముఖ ఫార్మా, కెమికల్ ప్రొడక్షన్ రంగ కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఇంటర్వ్యూల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులను కంపెనీ ఉద్యోగాలకు ఎంపిక చేసినందని డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్‌లు తెలిపారు. వీరికి రూ.3 లక్షల వేతనంతో ఉద్యోగావకాశాలు లభించాయని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. ఉత్తమ కంపెనీలు తమ కళాశాల విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వస్తున్నాయని కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ అన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా.ఎస్.వి.శ్రీనివాసరావు, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ సీహెచ్ శ్రీనివాసరావు, డా.కె.సురేష్ బాబు, కెమికల్ ఇంజనీరింగ్ ఇన్‌చార్జి విభాగాధిపతి డా.కె.రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటి నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ప్రత్తిపాడు: పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో వెంటనే పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమానికి పొగాకు రైతులు తరలిరావాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు పిలుపునిచ్చారు. పెదనందిపాడు, కాకుమాను మండలాల్లోని పాలపర్రు, రాజుపాలెం, పరిటాలవారిపాలెం, అన్నారం, నాగులపాడు, గార్లపాడు, పెద్దివారిపాలెం, కాకుమాను, కొమ్మూరు గ్రామాల్లో సోమవారం ఆయన నాయకులు దొప్పలపూడి రమేష్ బాబులు స్థానిక రైతు సంఘం నాయకులు నల్లమోతు రాజేంద్ర, పసుపులేటి శేషగిరిరావుతో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పొగాకు రైతులను కలిసి మంగళవారం పెదనందిపాడులో చేపట్టే నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. పెదనందిపాడు పాతబస్టాండు వద్ద ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమం జరుగుతుందని, అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందించనున్నామని ఆయన పేర్కొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ



ప్రథమ బహుమతి అందుకుంటున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లి రూరల్: ఏపీ పోలీస్ 4 సైట్స్ ఎ హాక్‌థాన్ 2025లో వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించినట్లు మల్టీ డిసిప్లినరీ డిపార్ట్‌మెంట్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూషిప్ విభాగం (ఎండీఐ అండ్ ఈ) డైరెక్టర్ డాక్టర్ నరసింహరాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండీఐ అండ్ ఈ విభాగం, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇంకుబేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూషిప్ (సీఐఐఈ) విభాగా ఆధ్వర్యంలో ఏఐ డీఎస్ హానర్స్ బీటెక్ ద్వితీయ సంవత్సరం ఇన్నోవేషన్ కోర్సు అభ్యసిస్తున్న వేదానంద ప్రణీల్ తన బృందంతో కలిసి ఈ పోటీలలో పాల్గొని విజేతగా నిలిచారని తెలిపారు. ఈ పోటీలలో సుమారు 150కి పైగా బృందాలు పాల్గొనగా 60 బృందాలు తుది జాబితాలోకి ఎంపికయ్యాయని వివరించారు. విజేత బృందం పరిష్కరించిన సవాల్ గురించి వివరిస్తూ వాట్సప్ చాట్స్, గ్రూప్ డేటా ఆధారంగా కీలక అంశాలు, ముందస్తు హెచ్చరికలు గుర్తించే ఏఐ టూల్‌ను అభివృద్ధి పరిచారని అన్నారు. కేఎల్‌యూ విద్యార్థుల సాంకేతిక నైపుణ్యం, ఆవిష్కరణాత్మక ఆలోచనకు ఇది నిదర్శమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్, ఆచార్యులు తదితరులు వేదానంద ప్రణీల్ బృందానికి అభినందనలు తెలిపారు.

ముమ్మరంగా నకిలీ బంగారం కేసు విచారణ

- ఇప్పటికే ఇద్దరు అరెస్ట్
- రికవరీకి నోచుకోని సొమ్ము

తాడేపల్లి రూరల్: రూ.9.20 కోట్ల నకిలీ బంగారం తాకట్టు పెట్టి బ్యాంకును మోసం చేసిన కేసును పోలీసులు ముమ్మరంగా విచారణ చేపట్టారు. మంగళగిరిలోని కరూర్ వైశ్యాబ్యాంక్‌లో నకిలీ బంగారం తాకట్టు పెట్టారంటూ మేనేజర్ మే మొదటి వారంలో ఫిర్యాదు చేశారు. మే 25వ తేదీన మంగళగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. బ్యాంకులో అప్రైజర్‌గా విధులు నిర్వహించిన చుండూరు మదన్‌కుమార్, రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయకుండా, డబ్బులు రికవరీ చేయకుండా వారిద్దరినీ కోర్టుకు హాజరుపరిచి చేతులు దులుపుకొన్నారు. ఈ కేసులో మరో కీలక వ్యక్తి అయిన టీకే ప్రసాద్‌ను కూడా మంగళగిరి పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకుని రహస్య స్థలంలో విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రసాద్, రాజశేఖరరెడ్డి బ్యాంక్ మేనేజర్‌ను, అప్రైజర్‌ను, బ్యాంకులో పనిచేస్తున్న మరికొంత సిబ్బందిని మభ్యపెట్టిచదువులేని సాధారణ తాపీ కూలీలుగా పనిచేస్తున్న నులకపేట, మంగళగిరిలోని పలువురు కూలీలకు రూ.1000, రూ.2000 ఆశ చూపించి బ్యాంకులో ఖాతాలు తెరిపించారు. చెక్కు బుక్‌లు తీసుకుని ఖాతాదారులకు ఇవ్వకుండా వారి వద్ద ఉంచుకుని ప్రసాద్ బ్యాంకులో చక్రం తిప్పి కృష్ణాజిల్లా మచిలీపట్నం నుంచి బంగారపు పూత పూసిన నకిలీ బంగారాన్ని విడతల వారీగా తీసుకువచ్చి మంగళగిరిలోని కరూర్‌వైశ్యా బ్యాంక్ శాఖలో పెట్టి రుణాలు తీసుకున్నారు. బ్యాంక్ మేనేజర్ బదిలీ అయ్యి కొత్త మేనేజర్ రావడంతో గుట్టు బయటకు వచ్చింది. విచారణలో మొత్తం రూ.9.20 కోట్లకు ఇప్పటికీ రూపాయి కూడా రికవరీ కాకపోవడం గమనార్హం.

అర్జీలకు సత్వరమే పరిష్కారం

పొన్నూరు: ప్రజల నుంచి వివిధ సమస్యలపై తీసుకున్న అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి 8 అర్జీలను స్వీకరించారు. వాటిలో రెవిన్యూ 2, సర్వే 4, పంచాయతీరాజ్ కు సంబంధించి 2 అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఎంఏఓ ఆర్.వెంకటేశ్వరరావు, అంగన్వాడీ సూపర్‌వైజర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటర్లు పెరిగితే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు

పొన్నూరు: పోలింగ్ కేంద్రంలో 1200 ఓట్లు దాటితే మరొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై ఆయన చర్చించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పెదకాకానిలో మూడు పోలింగ్ కేంద్రాలు, చేబ్రోలులో రెండు పోలింగ్ కేంద్రాలు, పొన్నూరు పట్టణంలో 8 పోలింగ్ కేంద్రాలు నూతనంగా ఏర్పాటు చేసే విషయంపై చర్చించారు. సమావేశంలో పట్టణ ప్రణాళిక అధికారి రఘురాం, అర్బన్ సర్వేయర్ శ్రీనివాసరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, గోపిశెట్టి వాసు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో సోమవారం సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సంఘనాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన టి.గౌతమ్ ఇంటర్ చదివేందుకు తగిన ఆర్థికసాయం అందజేయాలని కోరడంతో సంఘసభ్యులు స్పందించి రూ.25 వేలు సాయంగా అందజేశారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వెంకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.భాస్కరశ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఇ.శివన్నారాయణ, ఉపాధ్యక్షుడు ఎ.అంకమ్మరావు, సహాయ కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు, కె.అనిల్, కె.పద్మారావు, ఎం.సుబ్బారావు, వై.పూర్ణచంద్రరావు, ఆర్.సురేష్, బి.బ్రహ్మయ్య, ఎ.సాంబయ్య, ఆర్.సుబ్బారావు, జి.వెంకటేశ్వర్లు, ఎం.వెంకటరత్నం, ఆర్.శివకోటేశ్వరరావు, కాశయ్య, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు వినియోగించుకోవాలి

దుగ్గిరాల: మంచి విత్తనాలు సారవంతమైన నేలలో విత్తితే అధిక పంట వస్తుందని దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల గ్రామాల రైతులు ఖరీఫ్ సీజన్‌లో సబ్సిడీపై రైతుసేవా కేంద్రాల వద్ద తమ ఆధార్ కార్డు చూపించి నాణ్యమైన, మేలిమి లక్షణాలు కలిగిన వరి రకం బీపీటీ-5204 వంగడాలను తీసుకోవాలని కోరారు. కల్తీ విత్తనాలతో మోసపోకుండా లేబుల్, సరైన ప్యాకింగ్, క్వాలిటీ పరిశీలించి.. విత్తనాలను గమనించి తీసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో సూచించారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



విజయలక్ష్మిని సత్కరిస్తున్న గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు



అంకారావును సన్మానిస్తున్న ఎంఈఓలు కెనడీ

ప్రత్తిపాడు: అంకిత భావంతో ఉపాధ్యాయ వృత్తిని నిర్వర్తించే ఉపాధ్యాయులను సమాజం గుర్తించి గౌరవిస్తుందని మండల విద్యాశాఖాధికారి మహమ్మద్ ఖుద్దుస్ అన్నారు. గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న చావా విజయలక్ష్మి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో విజయలక్ష్మికి ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు, టీచర్లు దుశ్శాలువా, పూలమాలలతో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. 42 ఏళ్లగా ఉపాధ్యాయ వృత్తికి అంకితమై ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని విజయలక్ష్మి సేవలను కొనియాడారు. గుంటూరు ప్రాంతీయ రవాణా అధికారి బిక్కి సత్యన్నారాయణ ప్రసాద్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. హెచ్‌ఎం సరోజిని మాట్లాడుతూ.. 15 ఏళ్లగా పాఠశాలలో పని చేస్తూ సౌకర్యాల కల్పనలో ఔదార్యాన్ని చాటిన వ్యక్తి అని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో కె.నాగేంద్రమ్మ, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.సంజీవరెడ్డి, గంగాధరరెడ్డి, పుల్లారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఉపాధ్యాయులు రామచంద్రరావు, సీనియర్ ఉపాధ్యాయులు హనుమంతరావు, చంద్రమౌళి, నాగిరెడ్డి, శాంతి ప్రియ, అరుణ, వలిరాజు, శ్రీనివాసరావు, శివపార్వతి, ధర్మ రాజు, షకీల తదితరులు పాల్గొన్నారు.

కొండపాటూరు(కాకుమాను): పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు పాఠశాల హెచ్‌ఎం శీలం అంకారావు చేసిన సేవలు అభినందనీయమని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని కొండపాటూరు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై కాకుమాను వెళ్లిన అంకారావుకు సోమవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ.. గత 9 ఏళ్లగా పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తూ దాతల సహాయంతో సుమారు రూ.20 లక్షల వ్యయంతో విద్యార్థుల సౌకర్యార్థం డిజిటల్ తరగతి గదులు, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చేందుకు కృషి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అంకారావును పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.విజయ్ భాస్కర్, ప్రముఖ పారిశ్రామిక వేత్త, దాత యార్లగడ్డ అంకమ్మ చౌదరి, ప్రసాద్, రాఘవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేటూరు(కాకుమాను): 29 ఏళ్లగా ఉద్యోగంలో ఎందరివో మన్ననలు పొందడం అభినందనీయమని ఎంఈఓ కెనడీ అన్నారు. మండలంలోని రేటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేస్తూ కె.వెంకట సుబ్రహ్మణ్యం సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కెనడీ మాట్లాడుతూ.. సుబ్రహ్మణ్యం ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమని.. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ-విజయ్ భాస్కర్, హెచ్‌ఎం కె.వీరాస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు అధికారులు హాజరు



పీజీఆర్‌ఎస్‌కు హాజరైన అధికారులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. హాజరవ్వడమే కాదు.. అటూ ఇటూ కదలకుండా, సంతకాలు చేసి బయటకు వెళ్లిపోకుండా పీజీఆర్‌ఎస్ ముగిసే వరకూ గ్రీవెన్స్ ఛాంబర్‌లోనే ఉన్నారు. దీంతో ఛాంబర్ అంతా అధికారులతో కళకళలాడింది. పీజీఆర్‌ఎస్‌పై అధికారులు నిర్లక్ష్యవైఖరిని అవలంభిస్తున్నారంటూ గత కొద్ది వారాలుగా 'సాక్షి' కథనాలను ప్రచురిస్తున్న నేపథ్యంలో అధికారులంతా పీజీఆర్‌ఎస్‌కు హాజరయ్యేలా తహసీల్దార్ జి.కరుణకుమార్ చొరవచూపారు.

డాక్టర్స్ డే వేడుకలు నేడు



మాట్లాడుతున్న వీవీ ప్రసాద్

మంగళగిరి టౌన్: జూలై 1వ తేదీన డాక్టర్స్ డే సందర్భంగా మంగళగిరి పట్టణంలో ప్రజా ఆరోగ్యవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ప్రభుత్వ డాక్టర్లకు మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రజా ఆరోగ్య వేదిక మంగళగిరి రీజియన్ కన్వీనర్ వీవీ ప్రసాద్ తెలిపారు. మంగళగిరి నిర్మల జూనియర్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులందరికీ, 100 పడకల ఆసుపత్రి సాధన కమిటీ సభ్యులకు కూడా సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి సాధన కమిటీ 15 ఏళ్లగా పోరాటం చేసి సాధించిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ పోరాటంలో ఉన్న ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కేవీఎస్ సాయి ప్రసాద్, డాక్టర్ వంశీకృష్ణలతో పాటు సాధన కమిటీ సభ్యులందరికీ సన్మానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు పట్టణ పరిధిలోని వైష్ణవి కల్యాణ మండపంలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు ఎస్.బాలకృష్ణ, నాయకులు ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌ను పునరుద్ధరించాలని వినతి

ప్రత్తిపాడు: తమ పింఛన్‌ను పునరుద్ధరించాలని కొండేపాడు గ్రామస్తులు పీజీఆర్‌ఎస్‌లో అర్జీ ఇచ్చారు. కొండేపాడుకు చెందిన పచ్చల శ్రీనివాసరావు, గొల్లపూడి వేణుగోపాలప్రసాద్, చుండూరు సాంబశివరావులకు అధికారులు ఆరు నెలలుగా పింఛను పంపిణీ చేయకుండా 'డోర్‌లాక్ పేరుతో' వేధింపులకు గురిచేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడు వారాల కిందట ప్రత్తిపాడు పీజీఆర్‌ఎస్, గత వారం గుంటూరులోని పీజీఆర్‌ఎస్‌లో బాధితులు ఫిర్యాదులు చేశారు. స్పందించిన మండల అధికారులు లబ్ధిదారులు స్థానికంగా ఉండడం లేదని, మూడు నెలలు వరుసగా తీసుకోకపోవడంతో పర్మినెంట్ మైగ్రేషన్‌లోనికి వెళ్లాయని, సరైన ధ్రువపత్రాలు సచివాలయంకు అందిస్తే పింఛను మంజూరు కోసం చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలో బాధితులు సోమవారం ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో తహసీల్దార్ జి.కరుణకుమార్‌ను కలిసి ధ్రువపత్రాలు జతపరిచి వేర్వేరుగా అర్జీలను అందించారు. అధికారులు ఉన్నతాధికారులకు సైతం తప్పుడు నివేదికలు ఇచ్చి వారిని తప్పుదోవ పట్టించడం బాధాకరమని బాధితులు తెలిపారు.